# సంప్రదాయం

నారాయణబాబు, అప్పుడే భోంచేసి కొంచెం నస్యం సేవిస్తూ నడవలో అటూ ఇటూ ఓ గడియ తచ్చాడి బొద్దున ఇనప్పెట్టి తాళంచెవులు సవిరించుకునేసరికి ఆవలింతలొచ్చాయి. వాకిట్లో జట్కా ఆగిన అలికిడి గమనించలేదాయన. బెడ్డింగు లోపలకొస్తోంది. కమలకి కాలేజీసెలవలని తెలుసుగాని, ముందస్తిగా ఉత్తరం వ్రాయకుండా ఒచ్చే అలవాటులేదే అన్న దిలాసాలో వుండి పోయాడు. అమ్మాయి జట్కా దిగి 'గుడ్ బై' చెబుతోందప్పుడే ఎవరితోనో.

"రేపు లైబ్రరీనుంచి 'షా' తెచ్చిపెడతారు గదూ?" అంటోంది. పరకాయించి చూసాడు. నున్నటి క్రాపూ, పొందూరు ఖద్దరులాల్చీ, చిన్న రిస్టువాచీ అతి సింపుల్‌గా వున్నాడు. ఎరిగిన మొహమల్లే ఉంది. ఎవరా, అని గుమ్మంలో నిలబడిచూస్తూ నిల్చుండిపోయాడు నారాయణబాబు. కమల లోపలకొస్తోంది. ముత్తవత్తల్లి ఎదురొచ్చి "ఎంత చిక్కిపోయావే బుచ్చితల్లీ" అంటూ తల నిమిరింది. సూట్‌కేసూ, హోల్డాలూ, హ్యాండ్‌బ్యాగ్గూ బెంచీమీద సర్దించి మొకమల్ స్లిప్పర్లు విడుస్తూ "ఎప్పుడొచ్చినా బామ్మ చిక్కిపోయానంటుందేమిటి నాన్నా" అని కిలకిలా నవ్వింది కమల.

నారాయణబాబు అడుగుదామా వొద్దా అని పసాయిస్తున్నాడు. కాని టెన్నిస్ రాకెట్ చేతికందిస్తూ కమల తనకు తానే చెప్పింది.

"ఆయన్నెరుగుదువా నాన్నా - భాస్కరరావు - చంద్రం గారబ్బాయిట - మన వూరేట నాన్నా..."

"సరేసరి చంద్రశేఖరంగారి అబ్బాయి? అవును... అతనూ మీ కాలేజీలోనేగా చదువు తూంటా"

గుర్తుకొచ్చింది నారాయణబాబుకి. కాని ఇది పరిచయమా? స్నేహమా? ఎన్నాళ్లనించీ అన్న మీమాంస తెక్కండా వొచ్చిందతనికి. "నాకూ తెలియదు నాన్నా - ఇవ్వాళ ట్రెయిన్‌లో ఫస్ట్, సెకండ్ క్లాసులలో సరేసరి బెర్తులు ఖాళీ లేనేలేవు. ఇన్‌టర్‌లోకూడా చెడ్డ 'రష్‌గా'

ఉంటేనూ చాలా సాయపడ్డారు పాపం. 'ఇంటిదగ్గర దిగవిడచి వెడతాను' అంటే కాదనలేక పోయాను. వాళ్ల ఇంటికి మన మేడ మీదుగానే వెళ్లాలి గదా ఒకే జట్కాలో వచ్చాం నాన్నా" అని ఒక్క బిగిని, ముందస్తుగానే వల్లించి కంఠస్థంచేసిన పాఠమేదో వొప్పగిస్తున్నట్టు, అడగని సంజాయిషీ అప్రయత్నంగా ఇచ్చేసింది కమల.

"చిన్నప్పుడు చూసానితన్ని – జులపాలూ, ముచ్చటముడీ – గలీజుగా వుండేవాడు. ఇప్పుడు నేవళం తేరాడు – నాజూకమిరింది – చక్కా పుష్టిగా బొద్దుగా–" తక్కింది తల పంకింపుతో పూర్తిచేసి ముసిముసిగా నవ్వుకున్నాడు నారాయణబాబు.

బావుంది వరస! కమల సిగ్గుపడింది.

మర్నాడు ఉదయం కాఫీ గట్టా సేవించి డబ్బు చెల్లించేందుకు భాస్కరం పర్సు తడుము కొంటూవుంటే 'కౌంటరు' దగ్గర నారాయణబాబు అవుపించాడు.

భాస్కరరావు నిర్ఘాంతపోయాడు. అతనికర్థమయింది; కమల భవానీకేఫ్ ప్రొప్రయిటర్ కూతురన్నమాట – నిన్నంతా ట్రెయిన్‌లో అంతసేపు ఇష్టాగోష్ఠిగా వున్నా కమల ఎవరో తెల్సుకుందామనే ఆత్రమే లేకపోయింది. అసలా అమ్మాయి ఏం చెబుతోందో వినాలనే తోచలేదు తనకి. ఎంత ముద్దుగా ఎంత అందంగా, ఎంత శృంగారంగా మాట్లాడుతోందో, పలికే పలుకుతో అమ్మాయి చిరునవ్వు తళుకెంత కలిసిపోతోందో ఆరాలు చూసుకోవడంతోనే సరిపోయె. మొత్తం మీద కమల మంచి రూపసి! ఆమెను చూచిన దగ్గరనించీ ఆమె లావణ్యం అతని రక్తాన్ని గిలకొడుతూనే వుంది.

రాత్రి డాబామీద వెన్నెట్లో ఒంటరిగా పడుకుని నెమరుకి తెచ్చుకుంటున్నాడు. కృష్ణ కాలువలో తెడ్ల గలగల వినిపిస్తూంది. కమల మాట్లాడుతోంటే సరిగా అట్లాంటి గలగలలే మోగినట్టు గుర్తు – ఆకాశం మీద మబ్బులు పింజెలు పింజెలుగా గంభీరంగా నడుస్తున్నాయి. స్త్రీ 'గజగమన', 'హంసయాన' అన్నారుగాని కవులు, కమల నడిస్తే మబ్బులు గంభీరంగా ప్రయాణం చేసినట్టుంటుంది – పరిమళమేదో ముందుకి ప్రవాహంగా సాగినట్టుంటుంది. ఒకటే ధ్యాస – ఆమెలో ఏదో ఒక వింత ఆకర్షణ అతన్ని గజిబిజి చేస్తోంది... ఖండితంగా మాట్లాడు తుంది. మాటలలో వెకిలితనం లేదు. నిర్భయంగా, నిర్మలంగా చూస్తుంది. చూపులలో దొంగతనపు జీరయినా వుండదు. ఎంతో సహజంగా సిగ్గుపడుతుంది. ఆ సిగ్గులో నేరం కనిపించదు – సరిపోయింది – తెల్లవారేటట్టుంది. వెన్నెట్లో చలివేస్తుందేమోనని శాలువా తెచ్చుకున్నాడు పైకి – ఉక్కపోస్తోంది ఎదురు. అనుకున్న టయిముకి "షా" నాటకాల సీరీస్‌లో మొదటి వాల్యూము లైబ్రరీనుంచి తీసికొని చక్కా వెళ్లాడు కమలకిద్దామని. మొదటి వాల్యూమయింతరువాత రెండో వాల్యూమెట్లాగూ అడుగుతుంది. తరవాత సరే మూడూ, నాలుగూ... ఒకసారి అనుకున్నదల్లా మూడుసార్లు, నాలుగుసార్లు కమలను కలుసుకొనే అవకాశాలు ఒకదాని తరవాత ఒకటి గొలుసు కట్టుగా లభించే వీలూ పాలూ అంతా స్టడీ చేసుకునే బయలుదేరాడు. తీరా మెట్లెక్కుతుంటే నారాయణబాబు చిరునవ్వుతో ఆహ్వానించాడు – సరిపోయింది. ఈయనింకా కేఫ్‌కి వెళ్లనే లేదన్నమాట – పక్కని రీడింగు రూములో కూచున్నా రిద్దరూను. అటూ, ఇటూ సోఫాలు, మధ్య

మేజామీద 'చైనావేస్'లో గులాబీ రెమ్మ. 'బుక్‌షెల్ఫ్'లో లైనుగా అమర్చిన పుస్తకాలూ, గట్టా... బావుంది చక్కా నీటుగా... స్ప్రింగ్ కుషన్‌లో కూచుని సీలింగ్ వంక చూస్తున్నాడు భాస్కరం. నారాయణబాబు కాలేజీ వ్యవహారాలేవో భోగట్టాలు అడుగుతున్నాడు. బోడిగా, క్లుప్తంగా సమాధానాలు చెప్పుకొంటో పోతున్నాడు భాస్కరం.

మళ్లీ అందులో తను శాఖా చంక్రమణాలూ గట్టా చేస్తే సంభాషణకి చిలవలూ, పలవలూ మొలిచి ఇహ తెమలదేమోనని భయం. అసలు తను అంత పెందలాడే రావడమేమిటీ? గడియారంలో పందెం వేసికొని పరిగెత్తుకొచ్చినట్టుంది ఇంకా ఏడు కాలేదు. ఎంతో ఎండెక్కి పోయినట్టనిపించింది.

"ఈ పుస్తకమేనా మా అమ్మాయి కావాలంట?"

అని చేతిలోవున్న పుస్తకం చటుక్కున తీసికొన్నాడు నారాయణబాబు - కొంప మునిగింది. అంత ప్రమాదమొస్తుందనుకోలేదు భాస్కరం.

తీరా పుస్తకం ఆయన చేతికిచ్చిం తరవాత ఆయనెట్లాగూ కమలకిస్తాడుగా - తానింకా వుంటం దేనికని? ఏ వంకపెట్టుకొని చక్కా వచ్చాడో ఆ వంక కాస్తా వూడి చక్కాపోయింది. లేచాడు. "పుస్తకం కమలకిచ్చెయ్యండి" అని చెప్పి ఏదో అర్జంటు పనివున్నట్లు వెళ్లిపోబోతున్నాడు కొంచెం మొరటుతనంగా. ఆపినా ఆగలేదు - నారాయణబాబు యధాలాపంగా పుస్తకంలో పేజీలటూ ఇటూ తిరగేసాడు. మొదటి పేజీలోనే నీటైన బ్లూనెన్ పేపర్‌మీద ఒక చిన్న ఉత్తరం భద్రంగా మడిచిపెట్టి వుంది. ఉత్తరం కమల పేరనే వ్రాసిఉంది. అతని మొహం జేవురించింది - కొసాకూ చదివాడు - కొంచెం శాంతించాడు. మరీ జులాయిరకంగా లేదు. ఉత్తరంలో బాధ్యతతో కూడుకున్న ప్రణయతత్వం అంతో యింతో గోచరించిందతనికి. ఏమనుకొన్నాడో, ఉత్తరం ఏ పేజీలో వున్నదా పేజీలో ఎట్లావున్న దట్లా జాగర్తగా వుంచేసి కమలకిచ్చి వెళ్లిపోయాడు.

చెల్లాయి మారాముచేస్తే తీసుకుని సినిమాకి వెళ్లాడు భాస్కరం. తలవని తలంపుగా కమలా వచ్చింది సినిమాకి. ఇద్దరూ ఒకళ్లనొకళ్లు చూచుకొన్నారు. ఫలితం అవాళ్ల ఇద్దరూ సరిగ్గా సినిమా చూడలేదు. చెల్లాయి కటు కమలా ఇటు తనూ కూర్చున్నారు. రిజర్వులో - సినిమా ఆఖరు రీలు మొదలయింది - లైట్లన్నీ ఆరిపోయానై - సోడావాళ్లు కేకలు సద్దుకొన్నాయి. కమల చల్లని కంఠస్వరం చెల్లాయి తలమీదనించీ చెవిలో పడింది భాస్కరానికి. "పుస్తకంలో ఉత్తరాలు పెట్టకండి తప్పు" అన్నది కమల. భాస్కరం ఉలిక్కిపడ్డాడు. చీకట్లో ఆమె కళ్లు కొంటెగా మిలమిలలాడాయి. "అల్లరి పెట్టాలని ఉద్దేశ్యం నాకు లేదు స్మీ" అని వూదాడు. "అయితే మా నాన్నగారితో మాట్లాడండి - సరేనా?

"నీ ఇష్టపడితేనే"

"మాట్లాడండి - తప్పరుగా"

గప్పున లైట్లు వెలిగాయి. చెల్లాయి చెయ్యిపట్టుకుని భాస్కరం లేచాడు. చీకట్లో ఎవళ్లతోవని వాళ్లు పోతున్నారు. చుక్కలు చక్కలిగింత పెట్టాయిద్దరినీ.

సెలవలలో బద్ధక మెక్కువ. మధ్యాన్నం ఓ నిదరతీసి లేచి మొహం కడుక్కుని టీకని ధర్మాప్లాస్కిచ్చి పంపి తలగడామీద మోచెయ్యి ఆనించి చిన్నకథల పెద్దపుస్తకం చివరిపేజీ ఆవలిస్తూ తిరగేస్తున్నాడు భాస్కరం. "కులాసాగా వున్నారా?" అని పలకరించాడు నారాయణబాబు. భాస్కరరావు కలవరపడ్డాడు. ఉత్తరమాయన కంటబడిందా కొంపదీసి? కంప్లెయింటు చేద్దామని వచ్చాడా? ఇంతాచేసి చంద్రం గారి కోసం వచ్చాడేమో తన ఖంగారే కాని, "చంద్రంగారు కోర్టుపనిమీద వెళ్లారు. కూచోండ"ని పడకకుర్చీ చూపించి ఇష్టాగోష్టిలో ఆయన్ని మరిపించట మెట్లాగా అని మధనపడుతున్నాడు భాస్కరం.

"నువ్వు మా అమ్మాయికి వ్రాసిన ఉత్తరం చదివానోయ్ భాస్కరం" అన్నాడాయన హఠాత్తుగా. భాస్కరానికి గుండె ఆగింది. సంజాయిషీ అడుగుతాడా? ఏమి చెప్పాలి? కళ్ల యెదట స్టూలుమీద స్పష్టంగా అవుపిస్తూవుంటే ఎక్కడో పడిపోయిందనుకొన్న పెన్సిలుకోసం రగ్గు మడతలలోనూ తలగడా కుచ్చిళ్లలోనూ చకచకా వెతికేస్తూ వినిపించుకోనట్టు నటిస్తున్నాడు భాస్కరం.

"కాని నువ్వు సీరియస్‌గానే వ్రాసావనుకుంటున్నాను నేను" తీక్షణంగా చూసాడు నారాయణబాబు.

"నాకు మరో ఉద్దేశ్యం లేదండి" ఏధో అనేస్తే సద్దుకుపోకపోతుందా అని తాపత్రయ పడుతున్నాడు భాస్కరం.

"నువ్వా చదువుకున్నవాడవు, బాధ్యత ఎరిగున్నవాడవు. అంచాత ఏదో అల్లరిచిల్లరగా కాకుండా సక్రమమైన వాంఛనే వెల్లడించావనీ, నీకు మరొక దురుద్దేశ్యం లేదనే నాకూ అనిపించింది. చెప్పొద్దూ – అదే నీముఖతా తేల్చుకుందామని వచ్చాను. నేనెంతవరకు సరిగా వూహించ గల్గిందీ నువ్వే చెప్పాలి" అని వొదిలేసాడు నారాయణబాబు.

అమ్మయ్య! కొండంత బరువు దించేసినట్టయింది భాస్కరరావుకి. అతని కర్థమయింది.

"ఆ ప్రస్తావన ఎట్లాగూ వచ్చింది గనుక స్పష్టంగా చెప్పేస్తున్నాను. నాకు నిజంగా కమలని వివాహం చేసుకోవాలనే వున్నదండి" అని తల వంచుకొన్నాడు భాస్కరం.

"నీ కిష్టమే కావచ్చు కాని మీ..."

"నా కిష్టమయిం తరవాత ఒకళ్ల ఇష్టానిష్టాలతో నాకు పని లేదు."

అతని నిర్లక్ష్యాన్ని గుర్తుపెట్టుకొంటున్నాడు నారాయణబాబు.

"నీకు లెఖ్ఖ లేకపోవచ్చు, కాని..."

"కట్నాలతోటీ కానకలతోటీ నాకు ప్రసక్తి లేదు."

"అవన్నీ నాకు ఒదిలేసెయ్ – మీ నాన్నగారితో నేను సంప్రదిస్తాగా? చూసావూ భాస్కరం కమల నాకు ఏకైక సంతానం, నీకు తెలుసునో లేదో అది తల్లిలేని పిల్ల. దానిని కంటికి రెప్పలా

ఎంత అల్లారుముద్దుగా పోషించుకుంటూ వచ్చానో భగవంతుడికెరుక. దానిని ఒక అయ్యచేతిలో పెట్టేముందు అభిమానంగా చూచుకునే అత్తమామలూ, ఆడబిడ్డలూ, ఆదరణ చూపే బంధుకోటీ కావలసిన అగత్యం నాకు సహజంగా వుంటుంది. నీనించీ అభ్యంతరాలు లేవని అనిపించు కోవాలని మాత్రమే నీ దగ్గర కొచ్చాను."

"నా కిష్టమే"

నారాయణబాబు వెళ్లిపోయాడు.

పర్యవసానం ఇంత సుళువుగా, ఇంత తృప్తికరంగా ఫైసలయిపోతుందని భాస్కరరా వనుకోలేదు. అతనికి నిజంగా ఆనందం పుక్కిలింతలయింది కాని, ఇలా వొస్తుందనుకోలేదు - ఉత్తరాలూ, పత్తరాలూ, ప్రత్యుత్తరాలూ, సంకేతాలూ, సమావేశాలూ, నిరీక్షణలూ, నిర్వేదనలూ, ఒకటేమిటి ఎడతెగని ప్రేమలేఖల పరంపర; అతను ఊహించుకొన్న శృంగార చిత్రమంతా మధ్య మజిలీలన్నీ దాటేసి ఖచ్చితమైన 'బిజినెస్'లోకి దిగి చక్కా ఊరుకుంది. సరిపెట్టుకోక చేసేదేముంది. కాని, అతనికి జంకులేకపోలేదు. ఆలోచనకి అవకాశమివ్వకుండా వొచ్చాడు నారాయణబాబు. ఏదో గండం తప్పుతుంది గదా అని పెళ్లాడతానని ఫెడీమని అనేసాడా? ఎట్లాగూ కమల కొంచెం పెళుసు - చదువుకొన్న పిల్లని పెళ్లిచేసుకోవాలనే వుంటుంది. కాని, పెనిమిటంటే దైవసమానంగా చూచుకోవడమూ, భర్తమాట వేదాక్షరంగా పాలించటమూ ఇత్యాది సుగుణాలమీద మమత్వం అతని ఎముకలలో జీర్ణించిపోయివుంది. అతని నిర్ణయం సందేహ తరంగాలమీద కొంచెంసేపు అటూ యిటూ వూగిసలాడి ఆఖరికి వొడ్డున చతికిలబడింది - చట్ - చదువూ సంధ్యాలేని ఒక మొద్దుచేత చాకిరీ చేయించుకోటంకంటె కమలలాంటి సౌందర్యవతితో, విజ్ఞానవతితో కలహించినా ఆహ్లాదకరంగా వుంటుంది అనిపించింది భాస్కర రావుకి. ఇహ మనస్సుని ఆ తర్కం పొంతకి పోనివ్వదల్చుకోలేదు. పైగా కాసులలో ముంచి చేతుల్లో పెడతారు పిల్లని.

పెళ్లిచూపులయినాయి - కట్నాలూ, లాంఛనాలూ వారడిగినంతా వీరిచ్చినంతా - ప్రధాన మయింది. కోడలు వజ్రపు తునకలా వుంటుందని మురిసిపోతుంది భాస్కరం తల్లి. "మీ యింటికి వెలుగొస్తుందోయ్" అని చంద్రంగారి బావమరిది పరిహాసం చేసాడు. కమల పరీక్షా ఫలితాలకి ఎదురుచూట్టం మానుకుంది.

కమల నాయనమ్మకి పట్టశక్యం కాకుండా వుంది. అమ్మలక్కలతో అదే ప్రసంగ మామెకు.

రాత్తిరి వంటయిల్లు కడిగి పాలలో తోడుచుక్కవేసి వెళ్లిపోతూ చంద్రశేఖరంగారి వంటలక్క సుభద్రమ్మ, సకాలంలో పెళ్లిపనులు ప్రారంభించాలనీ, పప్పులు చెయ్యటానికీ, కారాలు కొట్టడానికీ మనుషుల్ని చూడాలని చెబుతున్నారు చంద్రంగారు. వెడుతూవున్నది ఆగి "అబ్బాయికి మా అన్నయ్యగారి సమంధం రైటయిందనుకున్నారు. నిజమేనాండి బాబూ?" అని నిలబడిపోయింది సుభద్రమ్మ. ఆ ప్రశ్న తప్పించి "నమ్మకమైన వాళ్లని చూడాలి, పనులు చురుగ్గా సాగాలి. ముహూర్తం బహుశా పాల్గునంలోనే పడుతుంది" అని పైకిచూచి డాబా మెట్లెక్కిపోతున్నారు చంద్రంగారు.

భాస్కరానికింకా నిద్దరపట్టలేదు. తుని కవటాకులు నములుతో, సగమయిన విల్స్ సిగరెట్టు పారెయ్యలేక వీధి అరుగుమీద కొంచెంసేపు విశ్రాంతిగా కూచున్నాడు. సుభద్రమ్మ లాంతరు స్తంభందాకా వెళ్లిపోయింది. వెనక్కి పిలిచాడు. ఒచ్చింది.

"మీ అన్నయ్యగారి సంబంధమంటావేమిటి?" బాసీపెట్టుమీద వున్నవాడల్లా గొంతు కూర్చుని రహస్యంగా అడుగుతున్నాడు భాస్కరం ఏదో అనుమానం సాలీడు బూజులా పట్టుకుందతన్ని.

"నారాయణబాబూ, మేమూ పెత్తండ్రి, పింతండ్రి బిడ్డలంకదండీ" అన్నది.

"అంటే, మీ తండ్రులిద్దరూ సయానా అన్నదమ్ములన్నమాటేనా?"

"సయానా."

"వినలేదే" అంటూ కూచుండిపోయాడు భాస్కరం.

"ఎందుకు వింటారు బాబూ - చెప్పుకుంటే మాకు ప్రతిష్టా, అతనికి ప్రతిష్టా - మాకూ అయిశ్వర్యముంటే మేమూ చెప్పుకొందుము - అతనూ చెప్పుకునేవాడు"

సుభద్రమ్మ వెళ్లిపోయింది. భాస్కరరావు ఆలోచనలో పడ్డాడు. ఇదెక్కడి సంప్రదాయం? అవ్వేళ సరిగా నిద్దరపట్టలేదతనికి.

మర్నాడు పార్కులో స్నేహితుల మధ్య ఆ ప్రస్తావన వచ్చింది. అంతా సరిగ్గానే మాట్లాడారు నిజానికి. కాని, ఒకళ్ళిద్దరు మాత్రం ఏదో సూటీపోటీగా అంటున్నారనుకుని, లేని అర్థాలు కల్పించుకుని బాధపడుతున్నాడు భాస్కరం - అందులోనూ శంకరానికి ఎంత తోస్తే అంత. "జమిందారుగారి మేనల్లుడికి దొరక్కదొరక్క చివరికి వంటపూటి సమంధం దొరికిందన్నమాట" అన్నాడు ఫెడీమని వాడు. అని ఊరుకోక "డబ్బురా నాయనా, డబ్బు డబ్బు" అంటూ న్యూస్ టయిమయిందని మునిసిపల్ లౌడ్‌స్పీకర్లవంక తొరతొరగా వెళ్లిపోయాడు. భాస్కరరావు తల వంచుకుని కుండీలో నూరు వరహాల చెట్టు తుంపుతున్నాడు. స్నేహితులు సంభాషణ మార్చారు.

రెండురోజులదాకా భాస్కరరావు ఎక్కడికీ వెళ్లలేదు. సాయంత్రం జనం మసలనిచోట, లాకుల కెగువని, తమ్మిలేటిగట్టున చల్లగాలి సేవించి చీకటిపడిం తరవాత ఇంటికొచ్చాడు. ఇంటిదగ్గర గలభాగా వుంది. దక్షిణపు గదిలో ఇనపెట్టె దగ్గర కవిలెకట్ట చూస్తున్నాడు చంద్రంగారు. చంద్రంగారికి వడ్డీ వ్యాపారం. వసారాలో గదిగుమ్మందగ్గర నుంచుంది నూకమ్మ. నూకాలు నారాయణబాబు గారింటో పనిమనిషి. నూకమ్మ తన చిన్న తమ్ముడికి జబ్బుగా వుండి, రూపాయికి రోజుకి కానీ చొప్పున వడ్డీ నిర్ణయించుకొని, రెండు తులాల రాగిడీ రెండు నెలలకి లోపాయికారీగా తాకట్టు పెట్టి 15 రూపాయలు పట్టుకెళ్లింది చంద్రంగారి దగ్గరనించి. వ్రాతకోతలు లేవు. ఉత్తరం వ్రాయాలనంటే రెండు తులాల తాకట్టు చాలదన్నారు చంద్రంగారు. వాయిదానాటికి సొమ్ము చెల్లింపకపోతేమటుకు తాకట్టు వాకట్టని షరతు. ఇంగ్లీషు లెక్కప్రకారం రెండు నెలలూ చూచి నూకమ్మ ఎంతకూ రాకపోతే రాగిడీ అమ్మేశానంటాడు చంద్రంగారు. అమావాస్య వెళ్లిన

చవితినుంచీ తెలుగులెఖ్ఖ ప్రకారం రెండు నెలలూ అంచనా వేసుకుని రాగిడీ అమ్మిన మర్నాడే వచ్చింది నూకమ్మ అప్పుతీర్చి పసుపు తీసుకెడదామని. అదీ ఘర్షణ.

"నూకమ్మా, నిన్ను నేనేమీ అన్యాయం చేయలేదు. నీకు తెలియకపోతే ఎవళ్లనైనా పెద్దమనుషుల్ని అడుగు వడ్డీ లెఖ్ఖలకి ఇంగ్లీషు మాసాలు చూస్తారుగాని తెలుగు నెలలు బద్దింపు వేస్తారురా ఎక్కడయినా? అందరికి ఒక లెఖ్ఖా, నీకొక లెక్కా కడతానా; నాకయినా నిజంగా ఫాయిదాతో కలిపి అంచనా వేసుకుంటే ఒకటి రెండు రూపాయలు తక్కువే కిట్టాయి, నమ్ము, నమ్మకపో, ఆనాడు గంగిగోవులా తలవూపిన కంసాలి వీరభద్రయ్యే ఇవాళ బంగారం జబ్బుదనీ, ముచ్చిబంగారంకన్న నాసిగా వున్నదనీ చప్పరించాడు" అని ప్రశాంతంగా జవాబిస్తున్నాడు చంద్రశేఖరంగారు. నూకమ్మ బుడిబుడి దుఃఖాలు సాగించింది. వస్తువు యింట్లోనే వున్నదని ఆమెకు గట్టి నమ్మకం. కొంచెం సేపటికి పాకం ముదిరింది. ఎవరి కమ్మారో ఆ ఆసామినే వెళ్లి ప్రాధేయపడతాను. ఎవరో చెప్పమని నిగ్గతీసింది. దానికి చంద్రంగారు ఆకుకి అందకుండా, పోకకి పొందకుండా సమాధానాలు చెప్పుకుంటో పోతున్నాడు. తాకట్టు వాకట్టయింతరవాత ఎవరి కమ్మిందీ, ఎంత కమ్మిందీ చెప్పాలిసిన అగత్యం తనకీ లేదనీ, తన యిష్టమొచ్చినవాళ్లకి, ఇష్టమొచ్చినంత కమ్ముకునే హక్కు తనకి వున్నదనీ కచ్చితంగా మాట్లాడుతూ చేతిలోవున్న దస్తరం నేలకేసి కొట్టాడు చంద్రంగారు. దానితో నూకమ్మ రెచ్చిపోయింది. ఆపైన నిప్పులు గక్కుతో కొప్పుముడి విడిపోతుంటే బారలు చాపుకుంటో శోకాలు పెడుతో వొళ్లెరగని కోపంతో నిర్ధారణ చెయ్యడానికి వీలులేని కంఠస్వరంలో "తినవయ్యా తిను – నా సొమ్మే తినవయ్యా నువ్వు – పది రూపాయలు చేతిలోపెట్టి రెండు తులాల బంగారం మింగేసావటయ్యా నువ్వూ – నా వుసురు నీకు తగలకుండా పోతుందాంట? కొంపలో మళ్లీ పెళ్లీ పెటాకులూ చేసుకోబోతున్నావాయెను – పైనించీ లక్షల కొంప మీదికి వేసుకుంటున్నా ఎంగిలికూటికి ఎగబడతావెందుకయ్యా నువ్వు? నీ యెదాన్ని నే నెన్నిసార్లు ఎంత వడ్డీ పొయ్యలేదు? నన్నే ఏడిపించాలటయ్యా? నా పొట్టమీదనే కొట్టాలిటయ్యా?" అని పొలికేకలేస్తూ వీధిని పడింది. వసారాలో ఇందాకా నిశ్శబ్దంగా కూర్చున్న భాస్కరం చర్రునలేచి అటకాయించి "ఆగు భడవా నీకు అన్యాయం జరిగితే కోర్టులో దావా వేసుకో అంతేగాని మాటలు మిగిలావంటే లాకప్‌లో పెట్టిస్తాను జాగర్త" అని ధిమాకీ చేశాడు.

కలిగినవాళ్లకి అన్యాయం జరిగితే ఏ కచేరీలోనో, ఏ వ్యవహారంలోనో, ఎక్కడో వొకచోట నొక్కి ప్రతీకారం చేస్తారు. అన్యాయంగాని, దానికి ప్రతీకారంగాని జరిగినట్టు రెండో కంటివాడికైనా తెలియదు. కాని, అలగా జనానికి కించిత్తు అక్రమం జరిగిందింటే వాళ్ళు ఎట్లాగూ ప్రతీకారం చెయ్యలేరు. కాని, వాళ్ళకు చాతనయిందల్లా యాగీ, అది ఎంతమంది నోళ్లల్లో పడితే అంత తృప్తి వాళ్ళకి. అంచాత పనిమనిషికిగాని, పాకీదానికిగాని, బిచ్చగాడికిగాని కష్టం కలిగిందంటే వాడవాడంతా మోగిపోతుందంతే; కాని, మోగటం మటుకే.

రాత్రి భోజనాలప్పుడు మళ్ళీ ఆ ప్రస్తావన రాలేదు. భోంచేసి తీరికగా దొడ్లో చామంతి మడిదగ్గర పైరగాలికి మడతమంచా లేసుకుని ఇష్టాగోష్ఠిగా పడ్డారు తండ్రీ కొడుకులిద్దరూ – భాస్కరరావు అందుకున్నాడు.

"అయితే నాన్నా, కొన్నాళ్ళక్రితం బహదూర్ మామయ్యగారింట్లో వంటపని చేసాడా నారాయణబాబు?" జమిందారు బాలంగారికి రావుబహదూరు బిరుదున్నది. ఆయన్ని బహుదూర్ మామయ్య అంటాడు భాస్కరం.

"అక్కడ చేసాడో లేదో నాకుగుర్తులేదుగాని, ఇతరత్రా వంట పనులు చేసినవాడే నారాయణబాబు. నీకు తెలుసుగా"

"మరి ఈ అయిశ్వర్యమెట్లా పట్టిందతనికీ?"

"నారాయణబాబు పాపం, చిన్నతనంలో చాలా పేదరికం అనుభవించాడు. ఇప్పటి ఆస్తినంతా అతని స్వహస్తాలమీద ఆర్జించిందే. వంటపని చేసిచేసి విసిగి ఆమధ్య మద్రాసులోనూ, బెంగుళూరులోనూ తన కింద మనుషుల్ని పెట్టుకుని పెద్ద హొటలు వోపెన్‌చేసీ పికిల్ షాపింగు నేర్పుగా సాగించీ చాలా ఆర్జించాడని వినికిడి."

"పికిల్ షాపంటే"

"అప్పట్లో అక్కడవున్న మన ఆంధ్రా స్టూడెంట్స్ గట్టా వూరగాయలకి మొహం వాచిపోయ్యే వాళ్లట. గోంగూర పచ్చడీ, చింతకాయ పచ్చడీ, వూరగాయలూ గట్టా అన్నీ బ్యాటిల్స్‌లో ప్యాక్‌చేసి పెద్ద వ్యాపారం సాగించాడీయన. ఇక్కడకొచ్చిన పదిహేనేళ్లనించీ హొటలూ, బోర్డింగూ, లాడ్జింగూ తెరిచి డబ్బు చేరలకొద్దీ సంపాయించాడు. షుమారు పది లక్షలదాకా వుంటుంది. చాలా మంచి వాడు పాపం. అతని సత్ప్రవర్తనా, అతనిహొదా, అతని దర్జా ఇపుడు చూస్తే ఒకప్పుడితనేనా గరిట పట్టుకుని హీనంగా బ్రతికినవాడనిపిస్తుంది."

"అయితే, ఇట్లాంటి నీచమైన సమంధం చూస్తావా నాకు?"

"నేనా ఈ సమంధం చూసింది నీకు?"

భాస్కరానికి వొళ్ళు తెలియటం లేదు. అసలీ బురదలోకి మొట్టమొదట అడుగు పెడతా తనే అన్న సంగతి మరిచిపోయాడు.

"నేను తెలిసుండే దిగాననుకుంటున్నావా?"

"తెలియదని ఎట్లా అనుకోను ఈ వూళ్ళో పుట్టి, ఈ వూళ్ళో పెరిగి. మన పొరుగువీధిన వున్న ఆసామీ పుట్టుపూర్వోత్తరాలు నీకు తెలియకుండా కూపస్థమండూకంలా వున్నావని కలగన్నావా? పోయి అడుగు. మెడకాయమీద తలకాయవున్న వాడికల్లా తెలుసు."

"ఏమిటేమిటీ? పోనీ తెలిసే నేను అంగీకరించాననుకో. నువ్వు చెప్పఖ్ఖర్లే నాకు? సమంధమెట్లావున్నా, సంప్రదాయం కావాలి కావాలని చొంగలు కారుస్తూ చెప్పే నువ్వు మంచి సంప్రదాయంగల కుటుంబమైతే చాలు, పిల్లని సయితం చూడనఖ్ఖర్లేదు కట్నం చిల్లిగవ్వయినా కాంక్షించను అని రొమ్ముగుద్దుకుని పలికే నువ్వు అబ్బాయీ, ఇది ఇట్లాంటి సమంధం అని నాకు చెప్పనఖ్ఖర్లే?"

"చెప్పలేదు. నాకభ్యంతరం లేదు కాబట్టి."

"నీ కభ్యంతరం లేదూ? నువ్వు వియ్యమందబోయేవాళ్ళు వంట మనుషులయినా, అడుక్కుతినేవాళ్ళయినా నీకు నిమిత్తం లేదన్నమాట."

"ఆ పని ఇప్పుడు చెయ్యకుండా వుంటే చాలు."

భాస్కరానికి రగులుకుంటోంది లోపల. కాని, అతనికి తెలుసు, చంద్రంగారు హెచ్చితే తగ్గుతాడు తగ్గితే హెచ్చుతాడు.

"అయితే, మొన్న నామధ్య లక్కవరంనించీ వో సంబంధం వస్తే వాడి పింతల్లి మేనల్లుడు కాలంనాడు నిడదవోలు పడవల రేవులో జంతికలమ్మాడనీ, వాడి పినతండ్రి కొడుకు దెందులూరు సంతలో కొలగారం చేసేవాడనీ, నెరుసులేరి ఆ సమంధం తిరగొట్టావెందుకని?"

"వాళ్ళకు డబ్బులేదు కాబట్టి."

"అయితే, డబ్బు చూచుకునే నారాయణబాబుగారి సమంధం ఖాయం చేసావన్నమాట?"

"ఇందులో నేను చూసుకొన్నదేమీ లేదురా అబ్బాయిా కట్నం కూడా అంతనీ, యింతనీ నేను మొరాయించలేదు."

"మాటల కేమిలే నారాయణబాబుకి కమల వొకర్తే కూతురని తెలియదాయేం నీకు?"

"అది నాకంటే నీకే ఎక్కువ తెలిసివుండాలి మరి."

భాస్కరరావుకి కొరడాతో కొట్టినట్టయింది.

"అయితే అబ్బాయిా ఈ ప్రశ్నలన్నీ నీకు ఎవరు నూరిపోసారురా?" అన్నాడు చంద్రంగారు, ఇక సంభాషణ తను నడపాలన్న సంకల్పంతో.

"నువ్వనుకోవడం, మనం నారాయణబాబు డబ్బుకోసం ఎరవేసుకుని కూచున్నామనీ జరిగిన తతంగమంతా దానికోసం పన్నినపన్నాగమనేగా?"

"అందుకు సందేహమా?"

"ఇందులో నారాయణబాబు స్వార్థం ఏకోశానా లేదనే వుద్దేశం అవునా?"

"ఆయన తప్పేముంది. కమల నేనంటే ఇష్టపడింది. అంచేత నన్ను కదిపాడు. నువ్వు సరే గంగిగోవులా తలవూపేశావు."

"తప్పుకాదురా నాయనా ఈ మాత్రం చదువుకున్న వరుడూ, ఈ మాత్రం ఆస్తిపాస్తులున్న సమంధం నారాయణబాబుగారికి రాకపోలేదు తెలుసునా? అతనూ సాంప్రదాయమైన కుటుంబంలో పిల్లని పడెయ్యాలని ఎంత తాపత్రయపడ్డాడో సులభంగా అర్థమవుతుందా? నీ వూహ కందలేదింకా? జమిందారు బాలంగారి మేనల్లుడుగాని అతనికి నచ్చలేదు. తెలుసా?"

"అందులో అతని తప్పేముంది? వంటపూజ బ్రతుకు బ్రతికినా అతనికి సంప్రదాయంగల కుటుంబంలో, పిల్లని పడెయ్యాలన్న జ్ఞానంవుంది. మనమంటే గడ్డి కరవడానికి సిద్ధమయ్యాం కాని..."

"అక్కడే పొరపడుతున్నావు నాయనా సాంప్రదాయమైన సమంధాలకోసం పాకులాడ వలసిన ప్రారబ్ధం మనకేమిట్రా? ఆ సంప్రదాయం మనకుందిరా.

"అయితే ఆ ప్రారబ్ధం నారాయణబాబుకి పట్టిందంటావు? మనకేమో డబ్బున్న..."

"మనం వెతుక్కోలేదు కావాలని డబ్బున్న సమంధాల కోసం వెతుక్కోవడం నీచం. వెతుక్కోకుండా వొళ్ళో వాలినప్పుడు పెడమొహం పెట్టుక్కూచోవడం తెలివితక్కువ. పైగా ఇందులో తప్పేమిటో నాకు గోచరించడంలేదు. అతనిక్కావలసిన సంప్రదాయం మన దగ్గరుంది. మనక్కా వలసిన డబ్బూ దస్కం అతని దగ్గరుంది. ఈ సమంధంతో అది మనకీ, ఇది అతనికీ సంక్రమి స్తుంది. అతని డబ్బుకోసరం మనం పాకులాడుతున్నామనే బదులు మన సంప్రదాయం కోసం అతను పాకులాడుతున్నాడనుకోరాదూ?"

భాస్కరరావు బియ్యే లో 'లాజిక్కు' తీసికొన్నాడు, కాని తర్కంలో ఈ వింతపోకదలింకా అతని బుర్రదాకా రాలేదు. అతనికి విసుగ్గా వుంది.

"ఏది ఎట్లావుండనీ సంప్రదాయంలేని కుటుంబమని తెలిసికూడా డబ్బుంది కదా అని జొరబట్టం నీచం" అన్నాడు భాస్కరం.

"అట్లాగే డబ్బు అంత లేదుగదా లొంగిరాకపోతాడా అని సంప్రదాయమైన కుటుంబంలోకి జొరబడాలని చూట్టం ధనికుడికీ నీచమే. నువ్వనే నీచం ఉభయత్రా వుంది. ఒరే అబ్బాయీ, నీ కింకా ఈ ప్రపంచంలో విలువలు తెలియవు. డబ్బున్నవాడికి ఇవాళ కాకపోతే రేపొస్తుంది సంప్రదాయం. అయితే ఎవడో వొకడు ఆ ముద్ర వేయడానికి పూనుకోవాలి. ఆ ముద్రాధికారం ప్రధమంలో ఎవడు తీసుకుంటాడో, ఎవడు తీసుకుందుకు సాహసిస్తాడో వాడికి ఐశ్వర్య మబ్బు తుంది. అంతే, సంప్రదాయమైన కుటుంబీకుడికి సులువుగా ఆస్తులు సంక్రమియాలంటే మన కొక్కటే మార్గం లేకపోతే దేనికీ సంప్రదాయం, మట్టికొట్టుకొనా?"

"అయితే సత్సంప్రదాయమల్లా డబ్బుని ఆకర్షించటానికే నంటావు."

"డబ్బున్నవాడు సంప్రదాయం కొనుక్కుందామని చూట్టంలే? అట్లాగే సత్సంప్రదాయమున్న సమంధం దొరకడం సామాన్యమా అని నేను అందరిచెవుల్లోనూ ఇల్లుగట్టుకుని పోరడం దేనికను కున్నావు?"

"నీకు సాంప్రదాయ మఖ్ఖర్లేదన్నావుగా?"

"నా కఖ్ఖర్లేకపోవచ్చు కాని నలుగుల్లోనూ సాంప్రదాయమంటే వుండాల్సిన విలువ పోషించుకుంటూ రావద్దూ? మనకంటూ సంప్రదాయమే ఆయెను."

"బావుంది సంప్రదాయానికి వుండాల్సిన విలువ వుండనే వుంది. నువ్వు పనిగట్టుకుని

పోషించేదేమిటి? డబ్బులేని వాడెందుకూ కొరగాడనీ, డబ్బున్నవాడే గొప్పనీ డబ్బు విలువని శ్లాఘిస్తూ మెడలో డప్పు వేసుకుని తిరిగాడా నారాయణబాబు?"

"డబ్బు విలువ బ్రతికున్న వాడికల్లా తెలుసు. చెప్పనఖ్ఖర్లేదు. తెలిసిందా? కాని సత్సంప్రదాయమంటే, వుండాల్సిన మోజూ, ఇయ్యాల్సిన విలువా ఎప్పటికప్పుడు నలుగురి చెవులలోనూ గింగురుమని మోగిస్తుంటే తప్ప నిలబడి చావదు."

"ఛ నాకీ సమంధం అఖ్ఖర్లేదు" అని చివ్వున లేచాడు భాస్కరరావు.

"అఖ్ఖర్లేకపోతే మానవోయి నాయనా. అఖ్ఖర్లేదనగానే మా నాయననా అని బ్రతిమలాడతా ననిగాని అనుకుంటున్నావేమో నాకా అవసరం లేదు తెలిసిందా? పిల్ల రత్నంలా వుంటుంది. చదువుకున్నది. నిన్ను ప్రేమించిన కన్య నువ్వు కోరుకున్న అప్సరస. కాళ్ళదగ్గరకొచ్చిన సమ్మంధం కనకవర్షం కురుస్తుంటే గొడుగేసుకుపోతావా? ఛో ఇందులో కలసొచ్చేదేమైనా వుంటే అది నాకుమాత్రం కాదన్నసంగతి మరొకసారి జ్ఞాపకం చేస్తున్నా. నాకు తెలుసులే ఈ చదువుకున్నవాళ్లకి ఆశయాలనీ, ఆదర్శాలనీ మారని సరుకెంతో బుర్రలో వుంటుంది. చూపులు ఆకాశంమీద పెట్టుకున్నా నడవాలిసింది నేలమీదరా నాయనా? నేలమీద ఇప్పుడు నిన్ను ఎలాగయినా బలవంతంపెట్టి ఈ వివాహానికి దింపుతానేమో నన్న అపాయానికి ఉపాయమేమిటా అనే ఆలోచనలో పడక్కర్లేదు. నువ్వు ఎదుర్కోవలసిన ప్రమాద మేమిటంటే నాకఖ్ఖర్లేదనిగాని నువ్వు అనాలోచితంగా నోరు జారితివా నిన్ను కారణాలైనా అడక్కుండా వొదిలేసుకుని కూచోడానికి సర్వసిద్ధంగా ఉన్నాను. తెలిసిందా?" అని ఉపదేశ పూర్వకంగా హెచ్చరించి పక్క సద్దుకున్నాడు చంద్రంగారు.

నారాయణబాబు నాలుగైదురోజులనించీ చంద్రంగారింటికి ఎడతెరిపి లేకుండా వెళ్లివస్తూ వుండడం గమనించింది కమల. ఆవేళ ఆ చెవిగాడుపు ఈ చెవికి కొడుతోవుంది. తిరిగితిరిగి యింటికొచ్చాడు నారాయణబాబు. రాగానే హాల్లో మడతకుర్చీలో కూలబడి ఉత్తరీయంతో విసురుకుంటున్నాడు. ఏదో అయోమయంగా కూచున్నట్టనిపించింది కమలకి. అతని మనస్సులోపడ్డ అగాధమేదో మొహమ్మీద కనిపిస్తోంది. గబగబ నాలుగు సీమబాదంపలుకులు మిళాయించి కొంచం నిమ్మకాయ షరబత్తుచేసి అందించింది. వట్టివేళ్ల విసనకర్రమీద కూజాలోని చల్లనినీళ్లు కసింత చిలికి పక్కన నిలబడింది. "పంకావేయి అమ్మా" అన్నాడు నారాయణబాబు. "పంకాగాలి వేడిగా వొస్తోంది నాన్నగారూ" అని వారించింది కమల. కొంచెంసేపు బడలిక తీరింతరవాత "ముహూర్తమింకా కుదరలేదానాన్నా" అని అడిగింది కమల. తన వివాహ విషయంలో తనే కలిపించుకుని అడగటమదే మొదటిసారామెకు.

"దానికే తడిమన్ను పొడిమన్ను అయేలా తిరుగుతున్నానమ్మా చంద్రంగారు భాస్కరావుని అడగమంటాడేమిటి?"

"ఆయననా? ముహూర్తం విషయంలోనా?"

"కాదు అసలు పెళ్లివిషయమేట."

"అదేమిటి?" ఆమె కర్థంకాలేదు.

"భాస్కరరావు కింకా అభ్యంతరాలున్నయ్యా?"

వెండిప్లేటులో పూరీలూ, బజ్జీలూ పట్టుగొచ్చి దగ్గర పెట్టింది నాయనమ్మ. పూరి బాగా వేగినవైపు ఒక్క పిసరు తుంచి మునిపంట కొరికి "సయించదంలేదమ్మా తీసెయ్యి" అన్నాడు నారాయణబాబు. "అదేమిటి నాయనా పెదపాదునుంచీ కర్పూరంలాంటి నెయ్యివచ్చింది. కన్నతల్లి కావాలని సొంతంగా చేసింది ఇవాళ పొరాటాలు ఒక్కటి నోట్లో వేసుకో నాయనగాదూ" అని బామ్మ సరసనేవున్న ముక్కాలిపీట మీద కూచుని లాలన చేస్తోంది. ఎంత వయసొచ్చినా నారాయణబాబు పసిపాపడే ఆమెకు. "మందంగా వున్నదమ్మా" అని మొహం చిట్లించాడు నారాయణబాబు.

కమల మంచినీళ్లకని మరచెంబుచ్చుకుని రీడింగు రూమనుకుని పడకగదిలోకి పరధ్యానంగా వెళ్లగా టేబిలుమీదవున్న రంగూను పాలరాతి బుద్ధవిగ్రహం చేతికి తగిలి ఇక్కడ కెందుకొచ్చానా అని నిలబడిపోయింది. ఆమెకు మనసు మనస్సులో లేదు.

అనుకున్నట్టే నారాయణబాబు భాస్కరర్రావుతో మాట్లాడడానికని వొచ్చాడు. తండ్రి ఇదంతా తనమీద రుద్దెయ్యాలని చూస్తున్నట్టు గ్రహించాడతను, భాస్కరం వొకయెత్తు వెయ్యాలని చూసాడు. తను ఏదో కొంత మొరటుతనంగా మాట్లాడేస్తే అతనికి మండి చర్రుమంటారు. దానితో తనూ తారాస్థాయిలో అందుకునేది, ఒక పెద్ద గలాటాకింద దింపేసేది. అంతేగాని అతనితో తాపీగా వాదానికి దిగితే తనకి వొక్కపాయింటూ మిగిలి చావదు. అదే అతని భయం.

"అయితే భాస్కరరావూ మీ నాన్నగారు నీకిప్పుడు ఏదో అభ్యంతరాలూ గట్రా..."

"క్షమించండి. నాకు వుండుకున్న అభ్యంతరాలన్నీ మీతోటి చర్చించదలుచుకోలేదు నేను. సమంధం నా కఖ్ఖర్లేదని మాత్రమే మీతోటి చెప్పమన్నాను.

"అది సబబైనమాటే కాదనను. ఎంచేతనంటే నాకఖ్ఖర్లేదని నువ్వంతా నిష్కర్షగా చెబుతున్నప్పుడు నీ కారణాలకోసం ఎదురుచూడాల్సిన అవసరం, నాకూ లేనేలేదు. అది మొదట్లో అయితేనూ కాని, ఇప్పుడు. ఇంతదూరం వచ్చిం తరవాత తంతులు జరిగిం తరవాత..."

"మించిపోయిందేమున్నది లెండి."

"నీకు తెలియదు భాస్కరరావు తాంబూలాలు పుచ్చుకున్న తరవాత, ప్రధానమయిం తరవాత - శుభలేఖలచ్చవుతోవుంటే సమంధం చెడిందంటే నీకు మించిపోయిందేమి లేకపోవ చ్చును - గాని ఆడపిల్లని కన్న తండ్రిని, నాకు కలిగే నష్టాన్ని నువ్వు భర్తీ చెయ్యలేవు. తెలిసిందా? ఈ స్టేజిలో ఎంతో వుపద్రవమైన కారణాలు వుంటేనే తప్ప సమంధాలు చెడవు. చెడితే మరి సమందా లెక్కవు. ప్రధానమయిం తరవాత మరో పెళ్లిమాటలకి దిగడం మారుమనువుకింద పరిగణిస్తారు మనవాళ్లు. నలుగురూ నాలుగు విధాల చెప్పుకుంటారు - పిల్లకు ముక్కు వంకరో - మూతి వంకరో నడవడి మంచిదవునో కాదో అని శంకించే దాకా వెళతారు. ఇంతదూరం

ఎందుకు చెబుతున్నానంటే మీరిద్దరూ ప్రేమించి పెళ్లిచేసుకుంటున్నారని కూడా పుకారు పుట్టింది – నీకు తెలుసునో లేదో."

"అయితే సంజాయిషీ ఇమ్మనమంటారా?"

"నేనంతమాట అనను" కాని నీ సందేహం ఒక అపోహ మాత్రమే కావచ్చు. అది ఎంతవరకూ సహేతుకమో పరిశీలించుకోవడానికీ, సాధ్యమైతే నీకు నచ్చచెప్పడానికీ నాకు అవకాశం యివ్వడం సబవు. నీ మెడలు విరిచి ఎట్లాగైనా నాపిల్లని నీకు కట్టబెట్టాలని చూచుకు నేటంత కక్కుర్తి నాకులేదు. నమ్ముతావా?"

ఎంతకీ వదలడు; సరిగదా చల్లగా వ్యవహారంలోకి దింపుతున్నాడు. తానింత గరిగమ్మ వాటంగా మాట్లాడుతున్నా కోపం రాకుండా వొచ్చిందేమిటీయనికి? తన ఎత్తు సాగేలాలేదే ఇప్పుడెట్టా? సాధనాంతరం ఆలోచించనే లేదతను. తణుకూ బెణుకూ లేకుండా ప్రశాంతంగా చెప్పుకొంటోపోతున్నాడంతే. ప్రపంచపు వొడుదుడుకుల్లో నలుగుడుపడి వొళ్లంతా కాయలుగాచి చేవదేరినవాడిలా అవుపిస్తాడు. పథకం మార్చాడు.

"పోనీ క్షమించండి – మీ సంప్రదాయానానికి సంబంధించిన కొన్ని హంశాలు నాకు అప్పట్లో తెలియక మాట యిచ్చాను."

"సులువుగా క్షమాపణకోరేసి గతాన్ని తుడిచిపెట్టిపారెయ్యాలని చూడకు. కాని అట్లాంటి ముఖ్యమైన హంశాలు ముందే తెలుసుకుని వుండాలిసింది – నువ్వు అవునా?"

"అబ్బే – చెబుతున్నాకదండీ – తెలుసుకోవలసిందే, కాని తెలుసుకోలేదు – నాకెవరూ తెలుపలేదు. క్షమించండి సరేనా?"

"సరేసరే – అయితే ఏమిటీ? నా సాంప్రదాయాన్ని గురించా?"

"అవును"

"అంటే నేను చిన్నప్పుడు వంటమనిషిగా బ్రతికాననే కదూ? స్పష్టంగాచెప్పు – అందులో తప్పులేదు ముసుగులో గుద్దులాటెందుకూ? వంటపనంటే అంత నీచమా?

"ఏదో అంతా అట్లా అనుకుంటాంకదండీ"

"అంతా అట్లా అనుకుంటే నువ్వూ అనుకోవాలా? అంతా రజస్వలా వివాహాలు తప్పను కుంటారు. నువ్వు తప్పులేదని వాదిస్తావెంచేత? అంతా ఆడపిల్లలకి చదువు కూడదంటారు – నువ్వు చదివించాలని పట్టుబడతావు దేనికీ? చదువుకున్న ఫలితమిదా? అంతా అనుకొంటూవుంటే నువ్వూ కాబోలనుకుంటున్నావా? స్వతంత్రంగా ఆలోచించి చూచుకోవాలిసిన విధి ఆలోచించుకో గల శక్తి నీకు వున్నదా లేదా?"

"అంతా అనుకోవడమే కాదులెండి నాకు అట్లాగే అనిపించింది చెప్పొద్దూ ఏమీ అనుకో కుండా వుంటే ఇంకా ఇష్టంగా చెబుతా మరి. ఏమిటి చేసేది. వంటమనిషి అంటే ఎట్లాగూ

ఒకడికింద నూఖరీ కదండీ."

"అయితే మీ నాన్నగారు చిన్నప్పుడు షావుకారు గుమస్తాచేసాడు. గుమస్తా గిరీ నౌకరీకాక యాజమాన్యమవుతుందా?"

"గుమాస్తా గిరీ అంటే అది వేరు. వంటపని అంటే కూలిపని గాదండీ? మీక్కోపమొస్తే చెప్పలేనుగాని..."

"కూలిపని అంటే రెక్కలోడ్చుకునే పని అనేగా నీ అర్థం. గుమాస్తా గిరిలో మాత్రం రెక్కల కష్టంలేకుండా వున్నదా? కావలసిన వస్తువు తూచడం - అందివ్వడం - లెఖ్ఖవ్రాయడం - సరిపుచ్చడం - సరుకు నిల్వాలు చూచుకోవడం అంతా చౌర్థి శ్రమలేని పనా? చెమట వోడ కండా చొక్కా మకిలికాకుండా పంచె నలక్కుండా జరుగుతుందా గుమాస్తాకి? వంటపనిలో మాత్రం తెలివితేటలఖ్ఖర్లేదు ఎలా అంపపేసినా సువాసనగల పోపులూ, కమ్మని వంటకాలూ తయారైపోతాయ్యా? గుండిగ పొయ్యెక్కిస్తేచాలు దప్పళం దానంతటదే చల్లారుతుందా?

"శ్రమపడాలి - తెలివితేటలూ వుండాలనుకోండి."

"అందులోనూ ఇందులోనూ కూడా"

"పైగా వంటమనిషంటే చాలా చులకనకదండీ - యజమానులు అడ్డమైన మాటలూ అంటారు - హీనంగా చూస్తారు."

"అడ్డమైన మాటలూనా? నన్ననటానికి దమ్ములెవడికీ లేవా నాడు మరి కనుక్కో - రాచమానివారింట్లో మీ నాన్నగారు గుమాస్తాగా వున్నప్పుడే నేనూ వంటకి కుదిరాను. మీ నాన్నగారి నడుగుపోనీ వారబద్ధమాడరు. రాత్రి తొమ్మిదిన్నరకి గ్లాస్కోపంచె కట్టుకుని. ఆమ్లా హెయిరాయిలు రాసుకుని క్రాపు నున్నగా దువ్వి వేళసందున విల్స్ పొగ వొదుల్తూ సినిమా రెండో ఆటకి చలాయిస్తుంటే ఆపరాత్రివేళ అప్పుడే వచ్చిన చుట్టపాయనకి బియ్యంపోసి వెళ్లమని ఇంటావిడ ప్రాధేయపట్టమూ నేను వినిపించుకోకుండా దులుపేస్తుండడమూ, పొగచూరే హరికేనులాంతరు దగ్గర జడతా లెఖ్ఖ కుదరక పంచపాళీలో ముక్కుతో మూలుగుతూ కూచున్న మీ నాన్న వోరకంట కనిపెడుతూ నవ్వుకునేవాడు. అసలు నేనంటే లగాయతూ పిల్లాజల్లా సమేతూ అందరికీ వొకటే హడలు దీనికి కారణం నేను పనికరెక్టుగా చేసేవాడి ననుకుంటున్నా వేమో. నెలకు కనీసం పది నాగాలైనా పెట్టే వాడివి. నాగాలైన మర్నాడు హాజరైతే ఏమని అడిగేందుకెవళ్లకి ఖలేజా వుండేదికాదు - అందాకా ఎందుకూ, మీ నాన్న గుమాస్తా అన్నమాటేగాని రోజూ కొట్టు తెరిచేముందు నారా కొని ఇంట్లోపడేసి వెళ్లడం, పిల్లలకేమన్నా కొంచెం నలతగా వుంటే ఆసుపత్రికి వెళ్లి అరఖులూ గట్రా పట్టుకురావడం వగయిరా డ్యూటీలు వుండేవిలే, తెచ్చిన కూరలో ముదురు వంకాయనీ, పండు కాకరనీ చేదు దోసకాయని, కుళ్లు మిరపకాయనీ తీసిపారేస్తుంటే ఇంటామెకి మీ నాన్నమీద గుర్రుగా వుండేది, నేను ఏరి పారేస్తున్నానని గాదు. మీ నాన్నచేసిన నిర్వాహకానికి. ఆ విలవకి కారణం లేకపోలేదు - గుమాస్తాని తొలిగిస్తే ఆ స్థానే బజారులో తొక్కితే లేస్తారు పదిమంది. వంటమనిషిని తొలిగిస్తే ఇల్లాలికి తక్షణం గరిటి

చేతికొస్తుంది. మళ్లీ వొక మనిషికోసం గాలించి పట్టుకునేసరికి ఏడాది గి(రున తిరిగి వస్తుంది."

హారి నీఇల్లు మాసిపోను! – వూపిరి సలపనిచ్చేటట్టు లేడీయన! మొత్తానికి రణరంగంలోకి ఈడ్చుకొచ్చాడు తనని. తను మొదట్లో అనుకున్నదేమిటీ? ఇంతదూరమెట్లా వచ్చాడూ తను? బావుళ్ళేదు. చూడగా చూడగా ఈయనా తన తండ్రీ ఒక స్కూల్లో చదువుకున్నారేమిటీ అనిపిస్తుందే? ప్లేటు మార్చాడు.

"కేవలం మీరు వంటపని చేసారని కాదనుకోండి – ఆ తరవాత మీ రవలంభించిన వృత్తీ అదీ..."

"అంటే హొటలు పెట్టాననా?"

"అదేలెండి అన్నం అమ్ముకొనే వృత్తి."

"అన్నీ అమ్ముకోవచ్చుగాని అన్నమమ్ముకోగూడదా?"

"అన్నం పర(బహ్మస్వరూపం..."

"అన్నం పర(బహ్మమంటే ఫక్కున నవ్వే నువ్వు అన్నం పర(బహ్మమంటే నమ్ముతావా? విద్య అమ్ముకోవచ్చా?"

"అదీ అమ్ముకోగూడదు నిజానికి – మన (ప్రాచీన మహర్షులు గురుకులాల్లో..."

"అయితే స్కూలు మేష్టర్లంతా సం(పదాయం చెడ్డవాళ్లేనా?"

"ఆ – చెడినవాళ్లనే నా వూహ."

అయితే కాలేజీలో చేరిం తరువాత కూడా హైస్కూలు' మేష్టర్లెవరయినా అవుపిస్తుంటే అతివినయంగా ఇంకా దణ్ణాలు పెడతావు దేనికని? ఆ విద్యావి(క్రేతలకి – అంతటి గౌరవానికి అర్హతలేనివాళ్లకి – ఇంత యెందుకూ? మాన(ప్రాణాలలో ఏది వున్నతం?

"మానం"

"(ప్రాణం నిలుపుకునేందుకు తినేది అన్నం. మానం కాపాడుకునేందుకు కట్టేదిబట్ట – అవునా?"

"అవునూ"

"అయితే మరి నీ లెఖ్క(ప్రకారం అన్నమమ్ముకోవడం నీచమయితే గుడ్డ అమ్ముకోవడం నీచాతినీచమవుతుందా కదా! మీ బహుదూర్ మామయ్యకి వొచ్చే సాలుసరి రాబడిలో మూడు వంతులు బట్టల షాపుమీదనని తెలుసునా నీకు? తెలిస్తే ఎవరివల్ల నీకేదో సాం(పదాయం సం(క్రమించిందని అనుకుంటున్నావో ఆ ఆసామీ తాలూకూ సాం(పదాయం నాలుగింట మూడుపాళ్ళు చెడినట్టే ఎంచుకుంటావా?"

"మీవాదన విపరీతంగా వుంది. గుడ్డ అమ్ముకోవడానికి పచ్చళ్ళు అమ్ముకోవడానికీ సాపత్యమేమిటండీ?"

"నేను పచ్చళ్లని పేరుపెట్టి అమ్మకం పెట్టలేదే? ఆవకాయకి కొన్ని కొన్ని మార్పులతో "అరుణోదయలేహ్యమని" పేరు పెట్టాను. గోంగూరచట్నీకి పుదేనాగట్లా తగిలించి రుచిలో ఒక విలక్షణత కలిపించి "బ్రడ్ స్వీటెనర్" అని పేరుపెట్టి బ్యాటిల్స్‌లో..."

"బ్రెడ్ స్వీటెనర్? ఏమిటి?"

దొరలు రొట్టెలమీద "ఛీజ్" లాగ "జామ్" వాడినట్టు ఉపయోగించేవాళ్లు దీన్ని - ఆ చట్నీ అంటే దొరలంతా వూటలూరుతో తినేవాళ్లు తెలుసునా? మాంబళంనించీ 'యూరోపియన్ కోలనీనించీ', 'వాల్తేరు అప్‌లాండ్స్‌నించీ', 'బెంగుళూరు కన్‌టోన్‌మెంట్' నించీ కుప్పతిప్పలుగా వొచ్చిపడే ఆర్డర్స్‌కి తట్టుకోలేకపోయేవాళ్ళం."

"ఎన్నిపేర్లు పెట్టినా ఆవకాయ ఆవకాయేకదండీ? మాపెత్తండ్రిగారనేవారులెండి..."

"మీ పెత్తండ్రిగారెక్కడున్నారిప్పుడు?"

అమ్మయ్య సంబాభాషణ మార్చినట్టున్నాడు.

"బెజవాడలో మెడికల్‌స్టోర్స్ పెట్టాడులెండి."

"మెడికల్‌స్టోర్సా" అయితే ఆ స్టోర్స్‌లో టానిక్కులూ ఇంజక్షన్లూ గట్టా అమ్ముతారా?"

అట్లా అడుగుతాడేమిటి? పల్లెటూరి దేవయ్యలా? మళ్ళీ ఏ చెంపనించో దెబ్బతీస్తున్నాడా?

"ఎందుకమ్మరూ?"

"ఓవల్టిన్ దేనితో చేస్తారో?"

"కోడిగుడ్డు సొనతోటి?"

"కాడ్ లివరాయిలూ?"

"చేపనూనెతో - అది పేరులోనే వుంది."

రక్తహీనంగా వున్నప్పుదు, కొన్ని ఇంజక్షన్లిస్తారు చూసావు నియోహెపటెక్సనీ, హెపటెక్సనీ.. అవి దేనితో తయారుచేస్తారంటావు?"

"ఏమో నాకు తెలియదు."

లేకపోతే ఏమిటి క్రాసింగు?

"తెలియకపోతే చెప్తా విను - అసలేమిటంటే మేక కారిజం తీసి, దాని 'ఎసన్స్' 'యాంవ్యూల్స్'గా సీలుచేసి అమ్ముతారు."

"అయితే కావచ్చును."

"ఓవల్టీన్ టిన్నులూ, హెపటెక్స్ యాంవ్యూల్స్ ఆ మెడికల్స్ స్టోర్స్‌లో సేలవుతాయిగదా. మీ బాబాయి కోడిగుడ్లూ మేకమాంసమూ అమ్ముతున్నాడంటే వొప్పుకుంటావా?"

"సరిపోయింది. ఓవల్టిన్ కోడిగుడ్డు సొనటండీ? ఆ సొనతో ఇంకా ఏమేమి మిళాయిస్తారో, నిలువవుంటానికి, ఏయే సాధనాలు అవలంభిస్తారో మీకూ తెలియదు, నాకూ తెలియదు. కోడుగుడ్డులోంచీ ఓవల్టిన్ డబ్బా వూడిపడుతుందిటండీ. దానికీ దీనాకీ మధ్య ఎన్ని బుర్రలు, ఎన్ని చేతులు ఎన్నియంత్రాలు పనిచెయ్యాలో గమనించారా మీరు?"

"అట్లాగే ఆవకాయలోనించీ 'అరుణోదయ లేహ్యాము' వూడిపళ్ళే. ఇంకా అపురూపమైన యితర సామాగ్రీ, పాళ్ళు కలపడం లగాయతు బ్రహ్మరుద్రుడికయినా తెలియని రహస్యాలూ ఎన్ని వున్నాయి ఆ ఇన్‌డస్ట్రీలో... ఎలక్ట్రిక్ స్టౌలమీద పని జరిగేది. రుబ్బురోట్లో కలిపి రాచ్చిప్పల్లోపెట్టి అమ్మాననుకున్నావుగామాలు – నేను ఎగుమతిచేస్తుంటా వూరగాయనీ, గోంగూర పచ్చడినీ ఎవడైనా వీసం గ్రహిస్తే నాలుగు రోజులు వ్యాపారం సాగించగలిగేవాడినా నేను? ఆ వ్యాపారంలో ఒక్క ఏడాదిలో లక్ష ఏభైవేలు సంపాయించాను. రెండువందలమందికి పనిగలిగించాను. తెలివితేటలందులో పనిచెయ్యలేదని అనటానికి ఎవడికైనా ఎన్నివేల గుండెలుండాల్నో ఆలోచించి అంచనావేసి చెప్పు చూద్దాం."

భాస్కరం వుక్కిరిబిక్కిరయిపోయాడు.

"అయితే మీ వాదన సహేతుకంగానే కనిపిస్తోంది నాకు. ఎంచేతనంటే ఇప్పుడు నా కర్థమవుతోంది క్రమక్రమంగా. మీరు దానిలో కొంత కృషిచేసి ఒక "మాన్యుఫ్యాక్చరింగ్ కన్‌సరన్" కింద ఇండస్ట్రీ స్టార్టుచేసి లార్జ్‌స్కేలుమీద ఎగుమతిచేస్తూ వ్యాపారం సాగించారన్నమాట."

"అట్లా దారికి రా, అయితే యింతకీ ఆవకాయి ఆవకాయి అని సూటిగా చెప్పి దగా లేకుండా అమ్ముకుని డబ్బు చేసుకుంటే, సంప్రదాయహీనమన్నమాట. ఆవకాయని మార్చి అరుణోదయ లేహ్యమని చెలామణీలో పెట్టి బ్యాటిల్స్‌లో బిగించి కార్కులతో సీల్‌చేసి లేబిల్స్ అంటించి మసిపూసిన మారేడుకాయిలా తయారుచేసి నల్లవాడి లగాయతూ తెల్లవాడి వరకూ దొరక్కుండా అందరి కళ్ళల్లోనూ సరిసమానంగా నిష్పక్షపాతంగానూ కారంగొట్టి ధనం రెండుచేతులా తోడిపారేస్తే సంప్రదాయం దెబ్బతినకుండా అట్టా నిలబడి వుంటుందన్నమాట."

"ఆపరేషను చేస్తున్నారండీ." తల గోక్కున్నాడు భాస్కరం.

"అదికాదు. సంప్రదాయమని నువ్వు కల్పించుకున్న ఆదర్శపు నీడల్లో ఎన్ని వైపరీత్యాలు దాగుడుమూతలున్నయ్యో నీ కంటి కవుపించాలనీ, నువ్వు యిన్నాళ్ళూ పోషించుకొంటూ వస్తూవున్న విలువల్ని నీకే చీల్చి చూపాలనీ నా ఆశయం. అంతేగాని, నిన్ను నొప్పించాలనీ, కుతర్కాలతో నిన్ను నా వైపుకు తిప్పుకోవాలనీ నేను కాంక్షించటం లేదు. నాకూ వివరాలన్నీ తెలుస్తూనే వున్నాయి. లోకంలో ఎన్నిరకాలయిన స్వార్థాలున్నయో అన్నిట్లోనించీ ఈదుకునే వచ్చాను నేను

– ఇప్పుడు ఎవళ్ళు నిన్ను ఎద్దేవాచేసి ఈ దురాలోచనలన్నీ చెప్పి నిన్ను నాదగ్గరికి పంపించారో వాళ్ళంతా ఎప్పుడో వొకప్పుడు ఎవడిచేతనో వొకడిచేత తమ తమ సమంధాలనుగూర్చి నాకు రహస్యంగా చెప్పించుకుని చాటునా మాటునా నన్ను మోగించి చూచుకున్నవాళ్ళే. వాళ్ళెవళ్ళకీ పట్టని అదృష్టానికి మరొహడు పట్టభద్రుడవుతుంటే చూస్తూ వూరుకుంటారా? వాళ్ళ అక్కసూ అసూయా అన్నీ పేరుకుని మారువేషాలలో వెటకారం రూపేణా వెళ్ళగక్కకుండా వుంటారూ? అది నీ మీద గాబట్టి బాగా పనిచేసివుంటుంది.”

“నారాయణబాబుగారూ క్షమించండి. పోనీ మీ ఇష్టమెట్లాగో అట్లాగే కానీండి.” బరువు దించేసుకున్నాడు భాస్కరం.

నాకట్లా పనికిరాదు. నీకు నిజంగా నా సంప్రదాయమంటే తేలిక అభిప్రాయం లేదని నాకు రూఢీ అయితేనే నీతో వియ్యమందుతాను నేను. అంతేగాని నేనేదో చాలాదూరం చెప్పానుగదా అనీ సద్దుకోకపోతే ఎట్లాగూ అన్నట్టు కొండ దిగివచ్చి నాకేదో వొరగబెడుతున్నట్టు నటిస్తే మాత్రం నా అభిమానం గాయపడుతుంది. నువ్వు లోతుగానే ఆలోచించి మరీ చెప్పు. ఎట్లాగూ కొంత మధనపడితేనేగాని, మనిషి వో నిశ్చలమైన నిశ్చయానికి తేరుకోడు. అదీ వొకందుకు మంచిదే – నేను వెడతా.”

నారాయణబాబు వెళ్లిపోయాడు.

ఇదంతా చంద్రంగారికి తెలిసింది. తెలుసుకోకుండా వుంటాడూ? ఆయన భాస్కరంతో ఘర్షణపడ్డాడేగాని తెలివి తక్కువగా వొదిలేసుక్కూచోలే – ఆయనకి బాహా తెలుసు నారాయణబాబు సత్తా – కాని వొక అనుమానం ఆయన్ని పీకుతోంది. నారాయణబాబు మళ్ళీ పెళ్ళి చేసుకుంటాడా? ఏమో...

భాస్కరాన్ని కదిపిచూచాడు. సుభద్రమ్మని పురమాయిస్తే ఆ కీలకం తెలుస్తుందని సలహా యిచ్చాడు భాస్కరం. సుభద్రమ్మ ఇక్కడికీ అక్కడికీ కనపడని టెలిగ్రాఫ్ తీగెలా పనిచేస్తూ వున్నదని ఇద్దరికీ తెలియదు.

రెండు రోజులయింది మూడు రోజులయింది. నారాయణబాబు రాలేదు. భాస్కరానికొక వుపాయం తట్టింది. కాలేజీలో తన మిత్ర బృందానికీ కమల స్నేహితురాండ్రకి ఎవరెవరికి ఆహ్వానాలు పంపాలో ఆమెతో తను కూడబలుక్కోవాలిసిన అవసరమేదో వున్నట్టు హటాత్తుగా స్ఫురించిందతనికి. సరేనని బయలుదేరి చక్కావెళ్ళాడు. కమల స్టడీరూములో రాకింగు చెయిర్లో కూచుని మేటీగుడ్డమీద డి.యం.సి. దారంతో పూలగుత్తి డిజైను వేస్తోంది. భాస్కర్రావు చూచాడు. అట్టే అలంకారాలు లేనేలేవు. అంచేతనే మరీ అందంగా వున్నదా? ఆమె ముందుకి రాగానే తానేదో మారిపోయినట్టే ఉన్నాడు భాస్కరం. ఆమె సౌందర్యం అట్లాంటిది. అంతర్గతంగా పరిమళమై పాకుతుంది గాని ఆకృతిగా కనురెప్పలు పట్టుకుని వేళ్ళాడదు. నిజంగా ఇట్లాంటి అందాలరాణీ ముందు సంప్రదాయమనీ చట్టుబండలనీ ఏమిటి తనకీ శల్య పరీక్ష? నారాయణ బాబు తనతో అంత వాగ్వివాదం పెట్టుకున్నాడుగాని కమలతో వొక్కసారి మాటాడమంటే

వొదిలిపోయేది.

భాస్కరాన్ని చూడగానే కమల ప్రొద్దుతిరుగుడు పువ్వులా గిరుక్కున తిరిగి "రండి కూచోండి" అని సవినయంగా స్వాగతమిచ్చి పావురాయిలా తుర్రుమంది ఇంట్లోకి.

అదేమిటి? అంతా సిగ్గే?

క్షణంలో కాఫీ పట్టుగొచ్చింది కమల - అందుకనా?

"వుంటారుగా పూరీలింకా వేగలేదు - వస్తా" అని వెళ్ళిపోబోతోంది. కాఫీ కొంచెం సేవించి "చాలా బావుంది - నీలగిరి కాఫీ గింజలా? నువ్వేనా చేస్తా? అని వోరకంట ప్రశ్నార్థకంగా చూసాడు భాస్కరం.

"ఏదోలెండి వంటపనిలో ఆమాత్రం నైపుణ్య మబ్బడ మొక లెఖ్ఖా - ఎంత లేదన్నా వంటమనిషి కుమార్తెనాయెను."

సరిపోయింది. చురుకుమాటలలో చురకత్తులేవో నూరుతున్నట్టుందీవిడగారు. అక్కడికీ మాట తప్పించి "నీ చెణుకులకేమిగాని కాలేజీలో మనం ఆహ్వానాలు పంపాల్సిన ఫ్రండ్స్ లిస్టొకటి వ్రాసియ్యి అని పెన్ తీసాడు భాస్కరం."

"చెబుతా వ్రాసుకోండి గుమాస్తావంశీకులికి వ్రాత పొంకంగా లమురుతుంది" కిసుక్కున నవ్వి నాలిక కొరుక్కుంది కమల.

అతనికి ఛర్రుమంది, అంతా తనని లొంగదియ్యాలని చూస్తారేమిటీ? ఎక్కడైనా వోటమి భరించవచ్చునుగాని... ఇక్కడ... తను ప్రేమించిన తరళాక్షిముందు... తనకి కాబోయే ధర్మపత్ని యెదుట!!... అతనికి కోపమాగలేదు.

"నా సంప్రదాయం నువ్వేమీ ఎంచనఖ్ఖర్లేదులే... మాది వంటపని గాదు. వంటపూటింటి పనిగాదు."

తిప్పికొట్టాననుకొన్నాడు. ఇహ లిస్టు వ్రాయదాని కుపక్రమించాడు.

"తమ వృత్తి ఏమిటో సెలవిస్తారా?"

"మాది వడ్డీవ్యాపారం."

ఆమెకు తెలియదుగావాల్ను.

"తాకట్టు వ్యాపారమంటే నిజానికింకా దగ్గరగా వుంటుందేమో."

"తణఖాలూ తాకట్టూ ప్రోనోటూ అన్నీ వడ్డీవ్యాపారంకిందకే వస్తాయి"

"అందులోనూ తాకట్టు మీ నాన్నగారు "స్పెషలైజ్ చేసారు లెండి."

"ఏమో నాకు తెలియదు."

తెలియదుగాబట్టే నే చెబుతున్నా వడ్డీవ్యాపారమంటే బ్యాంకింగు కాదు మీ నాన్నగారు చేసేది. తూరుపు పేటలో షెగిడీలకీ, కొత్తపేటలో మిల్లు కూలీలకీ, ఫిదంగి దిబ్బమీద వుప్పర్లకీ, పాచిపని చేసుకునే పాటక జనానికీ రోజువారీ వడ్డీ కట్టుకొని పదులూ, ఇరవైలూ వుత్తరమూ, పత్తరమూ లేకుండా బదుల్లిచ్చి (మళ్లీ పత్రాలు వ్రాస్తే వాయిదా నాటికి నోటీసులివ్వా, వస్తువు వేలానికి పెట్టా, ఎన్ని బాధలు) వాయిదానాటికి ఎలాగో అందకండా తప్పించుకొని మన్నాడు వస్తువు తెగనమ్ముకుని డబ్బు పోగుజేసుకునే వృత్తి ఇదీ మీ నాయనగారి వడ్డీవ్యాపారం. తెలిసిందా?"

"ఇట్లాంటి వ్యాపారం మాకు లేదు. తణఖా దస్తావేజులమీదా బ్యాంకుల్లోనూ..."

"మీకు తెలియదని ఇప్పుడే అన్నారు? ఆ తరవాత మళ్లీ నే నన్నదల్లా కాదంటారేమిటా?"

తనకి తెలియదన్నాడా? ఏమో జ్ఞాపకం లేదు దిక్కుమాలిన గోల.

"నువ్వొచ్చీ నన్ను దెప్పనఖ్ఖర్లేదు - ఎంతమంది రెక్కల కష్టమోద్చుకోకపోతే, హోటళ్ళలో కౌంటర్ల దగ్గర కూచుని, సర్వర్లకి తక్కువ జీతాలిచ్చి ఎక్కువపని చేయించుకుని ఎంతమంది పొట్టకొడితే, నీకీ లక్షలు పోగుపడ్డయ్యో ఒకసారి సింహావలోకనంచేసి చూసుకో మా నాన్న వృత్తిలో నెరుసులేరవచ్చావుకాని..."

"దాఖలా కావాలా? మీ నాన్న 'షైలాక్' అని రుజువు చెయ్యనా?"

షైలాక్ నూకమ్మ వీళ్ల పనిమనిషిగావును చటుక్కున జ్ఞప్తికి వచ్చింది భాస్కరానికి. తను మాత్రం ఏదో వొట్టి చేతులతో కుప్పిగంతులు వేస్తున్నాడుగాని, ఆమె ఏదో ఆయుధం గుప్తంగా దాచుకునే వచ్చింది... అంతలో ప్రసన్నమైన కంఠస్వరంలోకి దిగిందామె.

"అసలు మీ దగ్గరకి స్వయంగానే వద్దామనుకుంటున్నాను స్మండీ... మా పనిమనిషి నూకమ్మ సంగతి చెప్పబోతున్నాను. దానికి అభమూ శుభమూ తెలియదు. తమ్ముడికి జబ్బుగా వుండి తాకట్టుమీద మూజువాణీగా 15 రూపాయలు తెచ్చిందట. వాళ్లది చూశావూ. అదొక కాకుల లెఖ్క - ఒక రోజులో పొరపాటు వచ్చిందిగావును - దాని రాగిడీ దాని కిప్పించెయ్యి భాస్కరం మీ నాన్నగారితో చెప్తావుగదా?" సోఫామీద ఫొటో ఆల్బం తిరగేస్తూ లాలన చేస్తోంది కమల.

ఇప్పుడుగాని సరే అన్నట్టయినా. తనదీ తన తండ్రిదీ అంతా తప్పని నిర్ధారణయిపో తుందేమో - గోల -

"మరి పేదజనులంటే, పాటకజనమంటే అంత మమకారమాయెను - నీకు నీదగ్గర - పనిచేసే పేదరాలు, నీమీద ఆధారపడి జీవించే ఒక అనాధప్రాణి - ఒకనాటి ఆపత్తుకి ఒక షైలాక్ దగ్గరికి వెళ్లాల్సిన దుర్గతి పట్టిందన్నమాట పదిహేను రూపాయిల భాగ్యానికి. ఆ మాత్రం అవసరానికి నువ్వాదుకోలేకపోయినావా?"

"నాకు తెలిస్తే ఛస్తే వెళ్లనిచ్చేదాన్నా మీ నాన్నగారి దగ్గరికి? అది ఇదివరకే మా దగ్గర

వంద రూపాయిలదాకా వాడుకొని వుంది. అంచేత మళ్ళీ అడిగితే ఏమనుకుంటారో అని అడగలేదు. ఈ రభస వినగానే నేను వేసిన మొదటి ప్రశ్నే అది."

"అవునులే, దానికింత పిండాకూడు పడేసేది. నెలకేదో నాలుగు రాళ్ళు తగలేసి పేదరికంలో వుంచేసేది, ఆ తరవాత అడపా తడపా వంద రూపాయలుదాకా పెట్టుబడి పెట్టేది వూరికేనే యిచ్చేస్తున్నట్టు హుందాగా చెప్పుకునేది."

"వూరికే కాకపోయినా, వడ్డీ లేకుండానే లెండి. సరేగాని ఇప్పుడు దాని పేదరికానికీ, నా భాగ్యానికి, మీ ఆర్జనకీ పునాదులు త్రవ్వుకుంటూ పోతే సృష్ట్యాదికి పోవాలిసుంటుంది. నేను చెబుతుంటా దానికి జరిగిన వొక అన్యాయాన్ని గురించి మీ నాన్నగారితో చెబుతారా చెప్పరా?" సీరియస్‌గా అంటోందామె.

"నేను చెప్పను. కావాలంటే దానినే మా నాన్నగారితో చెప్పుకోమను."

"అంతేగాని, మీరు కలిపించుకోరన్నమాట."

"నాకా బాధ్యత లేదు."

"కాని, లాకప్‌లో పెట్టిస్తానని ధిక్కారం చేసినప్పుడు మాత్రం మీ బాధ్యతలూ, హక్కులూ గుర్తుకొచ్చినట్టున్నాయి."

"అప్పుడు అది కొన్ని మాటలు మిగిలింది. అంచేత దాన్ని నోరు మూయించాల్సి వొచ్చింది."

"అంత తిరుగుబాటు చేసేముందు దానికి ఎంత కష్టం కలిగి వుంటుందో మీరు ఊహించుకోకపోతే ఎట్లా?"

మౌనం.

"చెబుతారా?"

"చెప్పను."

"నీ కళ్లఎదుట జరిగే వొక అన్యాయాన్ని అరికట్టలేని నువ్వు పేదవాళ్ళనించీ పిండే వొక్కొక్క నెత్తురు బొట్టుతోబాటు ఒక్కొక్క రూపాయి రాల్చుకుని తినే నువ్వు నా సంప్రదాయమూ, నా నాగరికతా ఎత్తవచ్చావా? సాంప్రదాయమున్నా, లేకున్నా లక్షలు నొల్లుకునేందుకు తయారుగా వచ్చినట్టున్నావు."

పంజా విప్పిన ఆడపులిలా లేచింది కమల.

"నీ లక్ష లెవడికీ అఖ్కర్లేదు. హద్దుమీరి మాత్రం మాట్లాడకు" సోఫాలోంచి తారాజువ్వలా లేచాడు భాస్కరం.

"లక్షలు అఖ్కర్లేకపోయినా, వొస్తుంటే తప్పుతుందా పాపం. ఎన్ని లక్షలున్నయ్యో లెఖ్క

పెట్టుకునే వొచ్చినట్టున్నావులే. మా నాన్న రెండో పెళ్లి చేసుకోడని రూఢీ చేస్కున్నావుగా, అవునా? మా సుభద్రమ్మత్తయ్య చెప్పే వుంటుందిలే. కనుక్కొమ్మని సి.ఐ.డి.గా పంపించారుగా సిగ్గు లేకుండా – ఇహను ఆస్తి యావత్తూ సంక్రమించేందుకు ఆటంకాలు లేవని నిర్ధారణ అయిపోయిందిగా – తగుదునమ్మా అని అంగీకారం చెబుదామని వచ్చినట్టున్నావు – నడునడు. నీ చదువూ నీ సంప్రదాయమూ, నీ నాగరికతా ఇవన్నీ పదివేలిచ్చి మార్కెట్లో రేపీ పాటికల్లా కొనగలను నేను."

నారాయణబాబు ఆకస్మికంగా లోపలికొచ్చాడు.

"అమ్మాయీ ఏమిటిది?" భాస్కరం కూచో తొందరపడకు" అని సముదాయిస్తున్నాడు.

కమలకి రౌద్రమాగలేదు.

"నన్ను అటకాయించవద్దు నాన్నా. నాకీ పెళ్ళి అఖ్ఖర్లేదు." భాస్కరరావు వెళ్లిపోయాడు. అతని మెదడు బొత్తిగా చెడిపోయింది. ఇంటికి వెళ్ళీవెళ్ళగానే తండ్రిమీద విరుచుకుని పడ్డాడు. వ్యవహారమెట్లా బోరగిలపడిందో కొంత సూటిగా చెప్పి –

"అసలు ఈ అలగా జనానికి పదులూ పదిహేనులూ ఇచ్చి విపరీతంగా వడ్డీవేసికట్టి తాకట్టుసొమ్ము అమ్ముకుంటేనేగాని గడవదాయేమిటి నాన్నా మనకి?"

"విపరీతమైన వడ్డీలు ఇచ్చేవాళ్లకి లేనిదుగ్ధ పుచ్చుకునేవాళ్లకి పడితే యెట్లా? ఇంతకీ వడ్డీలు తగ్గించమనేగా నువ్వనేదీ?"

"అవును ఏదో న్యాయమైన వడ్డీలు కట్టుకుని..."

"న్యాయమైనవడ్డీ అసలు తగ్గించి వడ్డీలను అసలు తగ్గింపు వడ్డీల మీద యిచ్చుకుంటే మనకి అలగాజనంతో పనేమిటీ?" ఏ తణఖాలమీదనో, ఏ ఫరమ్సులోనో గట్టి పద్దులు చూచుకుని లక్షణంగా కాలక్షేపం చేయడం మంచిది."

"అవును అట్లా ఎందుకు చెయ్యగూడదూ? ఇది నీచం కాదూ?"

"అట్లా చేస్తే మన కొస్తున్న రాబడిలో పదోవంతయినా రాదు."

"రాకపోతే మానె వచ్చినంత ఆయెను."

"రాకపోతే పోనిమ్మని లక్షలున్నవాడు అనాలిసినమాట. ఇంతకీ నేనేదో ఈ అలగాజనాన్ని పీల్చేస్తున్నాననీ వేధించుకు తింటున్నాననేగా."

"అందుకు సందేహంకూడానా?"

"నేను మొదట్లో ఈ వ్యాపారం ప్రారంభించినపుడు ఈ పేటలో వాళ్ళంతా పండుగ చేసుకున్నారు."

"అదేమిటీ?"

"అవును అపుడు వాళ్ళ బ్రతుకులు కాబూలీవాళ్ళ చేతులలోనూ మార్వాడీల చేతుల్లోనూ

మూలుగుతూ వుండేవి. వాళ్ళు సరేసరి అర్ధణాలూ అణాలూ వడ్డీలు బనాయించి కట్టి, మూతులు బిగబట్టి. రూపాయిలు పిండుకునేవాళ్ళు. నేను కానీవడ్డీకి మించి ఎన్నడూ కట్టినపాపానపోలేదు."

"వాళ్ళమీద దయారసం కొద్దీ వడ్డీలు తగ్గించానంటారా? వ్యాపారమంతా నీవేపుకి రాబట్టుకునేందుకు వాయిదాలు తగ్గించావు. వాయిదాలు మాత్రం ఖచ్చితంగా..."

"లేకపోతే ఎట్లా? వ్యాపారమన్న తరవాత ఒక పద్ధతీ ఒక క్రమమూ వుండాలి. వాయిదాలు నిక్కచ్చిగా చూచుకోకపోతే మన వ్యాపారమసలే సాగదు. అందులో నేనొక సుళువుమార్గం చూపించా కూడా. ఏమిటంటే వాయిదానాటికి అసలీ వాయిదాలతో ఇవ్వలేనివాడు నా దగ్గరకే వొచ్చేది. ఆ మొత్తమంతా అప్పుతీసుకుని మరో పెద్దవస్తువేదైనా తాకట్టుంచి చిన్నవస్తువు పట్టుకుపొయ్యేదీ..."

"అవును ఆ బాకీ మళ్ళీ వాయిదానాటికి ఇవ్వలేకపోతే అంతకంటే పెద్దవస్తువు తాకట్టుంచేదీ ఆఖరి పెద్దవస్తువేదో అది మనకి దాఖలు పడుతుంది. అంతే కదూ?"

వస్తువు పెద్దదిగానీ చిన్నదిగానీ వాయిదాలోపు అయితే వాళ్ళదీ, వాయిదా దాటితే మనదీ. చెప్పేదేముందీ? డబ్బు పుష్కలంగా వున్నవాళ్ళు పెద్దపెద్ద మొత్తాలు మోతుబరుల కిచ్చుకుని వాళ్ళ అవసరాలు గడుపుతున్నారు. నేనేమో చిన్నచిన్న మొత్తాలు సామాన్యులకిచ్చి వాళ్ళ అవసరాలు గడుపుతున్నాను. ఇందులో నేను ప్రత్యేకంగా చేస్తున్న అన్యాయమేమిటీ అని, అదీ నాకు పట్టుకుంది. ఇహనంతా పెద్దపెద్ద మొత్తాలు మోతుబరులకిచ్చే ఘరానా వ్యాపారస్థులే అయితే డబ్బులేని పాటకజనం ఏమైపోవాలి?"

"మనకెందుకూ? ఆ వ్యాపారం మరెవళ్ళయినా చూచుకుంటారు లెస్తూ."

"ఎవరో ఏమిటి? ఇవాళ ఈ వ్యాపారం మానుకున్నట్లయినా రేపు మీ బహదూర్ మామయ్య తన చేతుల్లోకి తీసుకుంటాడిదంతా. అదిగో ఆ రాజన్న ఆయనచుట్టూ తిరుగుతున్నాడు. ఆయన్ని ఏ వ్యాపారంలో దూర్చనా అని చూస్తున్నాడు. లాభసాటి బేరమయితే మానేదెవడు ఇట్లాంటి చాదస్తాలు పెట్టుకుని?"

"అసలు పెద్దపెద్ద మొత్తాలు అప్పిచ్చేవాళ్ళకంటే ఎక్కువ వడ్డీలు మన మెందుకు వ్రాయించుకోవాలి?"

"వాళ్ళకేమిపోయిందీ? ఏ తణఖా దస్తావేజో రాయించుకుని ఇనపెట్టెలో పారేసి కాలిమీద కాలేసుకుని, కడుపుమీద చెయ్యివేసుకుని హాయిగా నిద్రపోతారు. మన కట్లా సాగుతుందా? తెచ్చినవస్తువు మాయ బంగారమో మంచిబంగారమో చూచుకోవాలి. దానికొక నమ్మకమైన కంసాలిమీద ఆధారపడాలి. ఒక్కొక్కసారి ఆ కంసాలి అప్పుకొచ్చినవాడితో లాలోచీ అవుతాడు. ఆ తరవాత ఆ వస్తువుని ఇనపెట్టెలో భద్రంగా వుంచి దానికి వాయిదారోజు వరకూ బత్తెంలేని జవానులా కాపలా కాయాలి. వాళ్ళకి చదువా చట్టుబండలా? అంతా అయింతరువాత 'ఒకటి చెప్పి ఒకటి రాయించావు – అప్పిచ్చిన రోజే అది తీర్చినరోజూ రెండూ కలిపి వడ్డీ లెఖ్ఖ వేస్తావు

టయ్యా?' అంటూ వ్యవహారమంతా కెలికి మొదటికొస్తారు. ఇందులో ఎంత బాదరబందీ వుంది? అంచాత వడ్డీ కొంచెమెక్కువ వేస్తాను. లక్షాధికార్లంతా లక్షలు పోగుపడకముందు ఇట్లాంటి వ్యాపారాలు చేసినవాళ్ళే. లక్షలు పోసుకున్న తరువాత మాత్రం అంతా నీరసించేవాళ్ళే. అయితే అబ్బాయీ – నువ్వు వెళ్ళిన పని ఏమయినట్టు?"

"అయిందయింది – అన్నీ తెగతెంపులయినాయి."

"కాదు మరీ? నువ్వు వెళ్ళి మళ్ళీ ఆయన సాంప్రదాయం వూసెత్తి వుంటావు. వాళ్ళు మన సాంప్రదాయమూ, మన వ్యాపార రహస్యమూ గట్టా దుమ్మెత్తి పోసివుంటారు..."

"ఇదంతా నువ్వే చేస్తా..."

"నేనా."

"అవును వాళ్ళ పనిమనిషి నూకమ్మ నీ దగ్గర వస్తువేమిటో తాకట్టుంచితే దాన్ని వాయిదా వెళ్ళిన మన్నాడే తెగనమ్ముకోనా? అది వెళ్ళి అక్కడ కంప్లెయింటు చెయ్యనా కమల దానిని వెనకాలేసుకుని నన్ను నిగ్గదియ్యనా?"

"అమ్మలేదులే, ఇంట్లోనేవుంది. కమలే అడిగిందీ? పోనీ అడిగితే మానె అదేదో పెంకి తనంగా మాట్లాడితే మా నాన్నగారికి కోపం వచ్చి వుంటుంది నేను చెప్పి దాని వస్తువు దాని కిప్పించేస్తాలెమ్మని ఏదో వుదారంగా మాట్లాడి సర్దెయ్యలేకపోయినావా? నువ్వు అక్కడకూడా నన్ను సమర్ధించివుంటావు. అవునా? పట్టూ విడుపూ వుండనక్కర్లే? ఎట్లాగూ నీకు రాజసం ఎక్కువరా అబ్బాయీ... దానిమీద వ్యవహారం బెడిసికొట్టి వుంటుంది."

భాస్కరానికి వుక్రోషంగా వుంది. ఎవరిని ఎందుకు ఏమనాలో అతనికి బోధపడటం లేదు. తల గిర్రున తిరుగుతుంటే కుర్చీమీద అలాగే కూచుని దీర్ఘాలోచనలో మునిగిపోయాడు.

ఎదుట దక్షిణపు గాలికి టపటప కొట్టుకుంటున్న క్యాలెండర్లో లక్స్ టాయిలెట్ సోప్‌మీద రతన్‌బాయి పకపకా నవ్వుతోంది.